అధిష్ఠానం పిలుపుతో ఢిల్లీకి ఎమ్మెల్సీ యోగేశ్వర్


బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అధిష్ఠానం పిలుపుతో ఎమ్మెల్సీ యోగేశ్వర్ ఆదివారం ఢిల్లీకి పయనమయ్యారు. చన్నపట్టణ ఉప ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీకి దిగాలని నిర్ణయించుకున్న ఆయన అభిమానులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించదలిచారు. ఈలోగా అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో సభ వాయిదా పడింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఆయన సోమవారం భేటీ కానున్నారు. అక్కడే అభ్యర్థి విషయమై కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి కుమారస్వామి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో చన్నపట్టణ ఉప ఎన్నిక అనివార్యమైంది.

ఆశలు గల్లంతు


19వ గేట్ వద్ద నీటి ఉధృతి


గేటు గల్లంతయిన ప్రాంతం


క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



- చైన్ లింక్ తెగడంతోనే విరిగిన గేటు
- తుంగభద్ర క్రస్ట్‌గేట్ ప్రమాదంపై అన్నదాత దిగ్భ్రాంతి
- ఖాళీ అవుతున్న డ్యామ్
- 65 టీఎంసీల నీరు నదికి వదలనున్న అధికారులు
- సాగు సాగేదెలా.. రైతుల్లో మొదలైన దిగులు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే ప్రమాదం
- 40 టీఎంసీలకు తగ్గితేనే మరమ్మతులకు అవకాశం
- మూడు, నాలుగు రోజుల్లో బిగించనున్నట్లు సమాచారం
- హుటాహుటిన సందర్శించిన డీసీఎం శివకుమార్

బళ్లారి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాత ఆశలు గల్లంతయ్యాయి. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నీటి ప్రాజెక్టుగా ఉన్న తుంగభద్ర జలాశయం (టీబీ డ్యామ్) ప్రమాదంలో పడింది. డ్యామ్‌కి అమర్చిన 19వ క్రస్ట్‌గేట్ చైన్ లింక్ తెగిపోయి, శనివారం రాత్రి కొట్టుకుపోయింది. దీంతో డ్యామ్‌లోని నీటిని నదికి వదిలేస్తున్నారు. సుమారు 65 టీఎంసీల మేర నీరు నదికి విడుదల చేయనున్నట్లు టీబీ బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. డ్యామ్‌లో నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గితేనే కొత్త క్రస్ట్‌గేట్ అమర్చడానికి అవకాశం ఉంటుందని బోర్డు ఇంజినీర్లు తెలిపారు. డ్యామ్‌కి మొత్తం 33 క్రస్ట్‌గేట్లు ఉన్నాయి. ఇందులో 19వ గేట్‌కు ఉండే చైన్‌లింక్ తెగిపోయింది. దీంతో గేట్ జారి కిందకు పడిపోయింది. గేటు డ్యామ్‌లోకి పడిపోయిందా, నదిలోకి కొట్టుకొచ్చిందా అనేది నీటిప్రవాహం తగ్గితేనే తెలుస్తుందని బోర్డు వర్గాలు పేర్కొంటున్నాయి.

క్రస్ట్ గేట్ ఎత్తే ప్రయత్నంలో..

డ్యామ్ గేట్ తెగే సమయంలో 104.182 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 36,739 క్యూసెక్కులు వస్తుండగా.. 54,960 క్యూసెక్కులు నదికి వదులుతున్నారు. డ్యామ్ 33 గేట్లను అడుగు మేర ఎత్తి నదికి నీరు వదులుతున్న సమయంలో శనివారం రాత్రి 19వ క్రస్ట్‌గేట్‌ను మరో అడుగు ఎత్తేందుకు అధికారులు ప్రయత్నించారు. ఆ సమయంలో క్రస్ట్ గేట్‌కు ఉండే ఒక చైన్ లింక్ కట్ అయింది. నీటి ఉధృతికి మరో చైన్ లింక్ కూడా తెగిపోయింది. గేట్ కనిపించకుండా నీటిలో కొట్టుకుపోయింది. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. అన్నిగేట్లు ఎత్తి నీరు నదికి వదిలారు. మిగిలిన 32 గేట్లు 2 నుంచి 3 అడుగుల మేర ఎత్తి నదికి 1.10 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. డ్యామ్‌లోని నీటిలో 65 టీఎంసీలుపోనూ నిల్వ 40 టీఎంసీలకు తగ్గితేనే క్రస్ట్‌గేట్ అమర్చేందుకు వీలవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఇన్‌ఫ్లోతోపాటు డ్యామ్‌లోని నీరు అంతా నదికి వదులుతున్నారు. 65 టీఎంసీల నీరు కిందకు వెళ్లడానికి కనీసం మూడు రోజులు పడుతుందని బోర్డువర్గాలు తెలిపాయి. నదీతీర గ్రామాల వారిని అప్రమత్తం చేస్తున్నారు.

గేట్ తయారీ బాధ్యతలు ప్రముఖ కంపెనీలకు..

విజయనగరలోని తుంగభద్ర స్టీల్ తయారీ కంపెనీతోపాటు హిందుస్థాన్ స్టీల్ తయారీ కంపెనీ, నారాయణ స్టీల్ తయారీ కంపెనీకి క్రస్ట్‌గేట్ తయారీ బాధ్యతలు అప్పగించినట్లు బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి తెలిపారు. విజయవాడ, అనుభవజ్ఞుల సూచనలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ముఖ్యమంత్రుల ఆరా

తుంగభద్ర డ్యామ్ క్రస్ట్‌గేట్ ఊడిపోవడంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు.. అధికారులతో వివరాలు ఆరాతీశారు. వెంటనే మరమ్మతులు చేసి నీరు వృథా కాకుండా చూడాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు.. అధికారులకు సూచించారు. డ్యామ్ మరమ్మతుకు సదా సహకరిస్తామని, నిపుణులను పంపుతామని తెలిపారు.

ప్రజాప్రతినిధుల పరిశీలన

ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఏపీలోని రాయదుర్గం


డ్యామ్‌ను పరిశీలిస్తున్న కర్ణాటక, ఆంధ్ర నేతలు

అన్నదాతల్లో ఆందోళన


బళ్లారి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నిండకుండలా తొణికిసలాడుతోంది. డ్యాంలో సామర్థ్యం సరిపడా నీరు అంటే 104 టీఎంసీల పైనే జలాలు చేరాయి. ఇక ఈ ఏడాది పంట పండినట్లే అన్న రైతుల ఆశలు మునిగిపోయాయి. అయితే ప్రమాదం క్రస్ట్ గేటు రూపంలో వచ్చింది. అంతా బాగుంది అనుకుంటుందగానే రాత్రికి రాత్రి పెనుముప్పు తరుముకొచ్చింది. క్రస్ట్ గేటు ఊడిపోవడం డ్యాంలో ఉండే నీరంతా నదిపాలు కావడం నిజంగా బాధాకరం. పాపం ఎవరిదైనా శాపం రైతులకే తాకిందని చెప్పవచ్చు. ఆయకట్టు భూముల్లో నార్లు వేసుకునేందుకు చాలా మంది రైతులు నారు మళ్లు సాగుచేశారు. నీరు అందకుండా పోతాయనే ఆవేదనతో రైతులు దిగులు చెందుతున్నారు. కొందరు రైతులు వేల్ల రూపాయలు పెట్టి మాగాణి భూములను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు ఇలాంటి పరిస్థితుల్లో తుంగభద్ర జలాలు పొలాలకు అందవు అని రైతులు దిగులు చెందుతున్నారు.

- ఇంత పెద్ద ప్రమాదం జరగడంతో అధికారుల నిర్లక్ష్యం స్పష్టమవుతుందని రైతులు మండిపడుతున్నారు. వర్షా కాలం ముందు డ్యాం పరిస్థితి, క్రస్ట్ గేట్లను అధికారులు పరిశీలించాలి. ఒకటికి రెండు సార్లు పరిశీలించిన తర్వాతే గేట్లను తెరవాలి. ఇంతటి ప్రమాదాన్ని తుంగభద్ర అధికారులు ఎందుకు పసిగట్టలేకపోయారో విచారణలో తేలాల్సి ఉంది. ముందే ప్రమాదాన్ని గుర్తించి ఉంటే ఇంత పెద్ద విపత్తు ఎదురైయ్యేది కాదని పాలకులూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్యాం కింద పంటల సాగు కాకుండా పోవడంతో పాటు నదీతీరంలో వరదకు రోడ్డు కోతకు లోనయ్యాయి. తీర గ్రామాల్లో నీరు చేరి జనజీవనానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. క్రస్ట్ గేటు ప్రమాదంలో ఉందని గతంలో కేంద్ర జలవనరుల శాఖ నిపుణులు కూడా సూచించారు. కానీ బోర్డు అధికారుల నిర్లక్ష్యం కారణంగా పెనుప్రమాదం సంభవించిందని పలువురు విమర్శిస్తున్నారు.


ఆయకట్టు కింద వరినాట్లు (ఫైల్)

కంప్లి, గంగావతి మధ్య రాకపోకలు బంద్

కంప్లి, ఆగస్టు 11 : తుంగభద్ర జలాశయంలో 19వ గేట్ తెగి పడిపోవడంతో జలాశయం నుంచి నీరు నదికి పోటెత్తాయి. రెండు మూడు రోజులుగా వంతెనపై కాలినడకతో ప్రయాణం కొనసాగించేవారు. నదికి నీరు పోటెత్తడంతో కాలినడక ప్రయాణాన్ని కూడాబంద్ చేపట్టారు. దీంతో రైతులు, ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదు. సన్నాపురం వద్ద నదికి నీరు ఎక్కువగా రావడంతో మోటార్లు మునిగిపోయాయి. హంపి వద్ద నీటి ప్రవాహం కోదండరామస్వామి ఆలయాన్ని తాకుతోంది. ఆదివారం ఉదయం అడిషనల్ ఎస్పీ రవిచంద్ర, సీఐ వాసు కుమార్ కంప్లి కోటను సందర్శించారు. మత్స్యకారులు నది ఒడ్డుకు వెళ్లరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. నది ఒడ్డున వుండే గ్రామాలు కంప్లి కోటే, బెళగోడుహాళ్, సన్నాపురం, ఇటిగి, మన్నూరు, సూగూరు గ్రామాలు ఏ సమయంలో నైనా జలాశయం నుంచి అత్యధిక నీరు రావచ్చని అప్రమత్తంగా వుండాలని అధికారులు సూచించారు.


హంపి కోదండరామ దేవస్థానం వద్ద...


కంప్లి కోట వద్ద నిలిచిపోయిన కాలినడక ప్రయాణం


నదిలో మునిగిన మోటార్లు

నెరవేరిన లక్ష్యం


చర్చాగోష్ఠిలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్


తెలుగు కథ ప్రపంచం అంశంపై ప్రసంగిస్తున్న కుప్పిలి పద్మ, వేదికపై వివిన మూర్తి, రాజిరెడ్డి, మొహమ్మద్ ఖదీర్ బాబు




- దక్షిణభారత భాషలను ఏకతాటి పైకి తేవడమే ధ్యేయం
- సామాజిక స్పృహ అస్థిత్వానికే తెలుగు సాహిత్యం ప్రాధాన్యం
- తెలుగు కథా ప్రపంచంలో వక్తలు
- ముగిసిన బుక్ బ్రహ్మ సాహిత్య సంబరం
- ఐదువేల మందికి పైగా రచయితల భాగస్వామ్యం

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత భాషలను ఏకతాటిపైకి తేవడమే ధ్యేయంగా ఏర్పాటైన 'బుక్ బ్రహ్మ సాహిత్య' ఉత్సవం 2024 అనుకున్న లక్ష్యాన్ని అధిగమించేలా విజయవంతమైంది. కోరమంగలలోని సెయింట్‌జాన్స్ ఆడిటోరియంలో మూడు రోజులపాటు సాగిన బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ ఆదివారంతో ముగిసింది. నాలుగు భాషలకు సంబంధించి ఐదువందలమందికిపైగా రచయితలు, వేలాదిమంది సాహితీ అభిమానులు సందర్శకులతో నిత్యం సాహిత్యజాతర సాగింది. పదులకొలదీ పుస్తకాలు విడుదల కాగా అంతకుమించి తమ రచనలను ప్రముఖులకు అందించే విధానంతో వందలాది పుస్తకాలను అభిమానులకు సమర్పించుకున్నారు. మూడు రోజుల్లో ప్రముఖుల చేతికి పదుల సంఖ్యలో పుస్తకాలు చేరాయి. అభిమాన రచయితలు, అనుభవ సాహితీవేత్తలతో మరపురాని ఫొటోలతో సోషల్‌మీడియాలో కూడా మార్మోగింది. వెంకటేశ్‌కుమార్ హిందూస్థానీ సంగీతకచేరీకి వేలాదిమంది సభికులు మంత్రముగ్ధులయ్యారు. ఉదయం 8.30 గంటలకే ఆడిటోరియం జనం రద్దీతో నిండింది. ఆ తర్వాత విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ సోలో పర్‌ఫార్మెన్స్ విశేష ఆకర్షణ గా నిలిచింది. సమాజంలో మనిషి మౌనంగా ఉండడమే ప్రమాదకరమని, ప్రశ్నించే తత్వమే లేకుంటే మనుగడ ప్రశ్నార్థకమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. మేఘనా చంద్రమౌళి ప్రదర్శన ఆకట్టుకుంది. హగరి తీరద పుస్తకాన్ని ప్రకాశ్‌రాజ్ ఆవిష్కరించారు. యక్షగాన ప్రదర్శన అలరించింది.



తెలుగు కథా ప్రపంచంపై ఆకట్టుకున్న చర్చాగోష్ఠి

చివరి రోజు 'తెలుగు కథా ప్రపంచం' అనే అంశంపై జరిగిన చర్చ ఆకట్టుకుంది. ప్రముఖ రచయిత్రి కుప్పిలి పద్మ అభిప్రాయం మేరకు వస్తువు సమయాన్ని బట్టి రచన సాగుతుందన్నారు. సమాజంలో స్త్రీలు అనే అంశంపై కొత్త మార్గాన్ని అన్వేషించే రచనలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. వ్యాసం, కథ, నవల, పద్యం, కవిత ఇలా సందర్భాన్ని వస్తువును బట్టి రాస్తానన్నారు. మహ్మద్ ఖదీర్ బాబు మాట్లాడుతూ తెలుగు కథలు అస్తిత్వం సామాజిక స్పృహకే ప్రాధాన్యత ఇస్తున్నాయన్నాని అనిపిస్తోందన్నారు. జీవనగాథలు సుదీర్ఘకాలం మనుగడ సాధిస్తాయన్నారు. ఒక సమస్యపై కథనం లేదా రచన సాగితే అది పరిష్కారమైతే రచనకు ప్రాధాన్యత ఉండదన్నారు. వివిన మూర్తి అభిప్రాయం మేరకు మంచికో చెడుకోగానీ చెప్పలేంగానీ ఒకే విధానంతో సాగుతోందన్నారు. జయమోహన్ రచించిన 'నెమ్మినీలం' పుస్తకాన్ని అవినేని భాస్కర్ తెలుగులోకి అనువాదాన్ని ప్రముఖ రచయిత్రి మృణాళిని ఆవిష్కరించారు. ఛాయా ఎడిటర్ అరుణాంక్ లత, వసుదేంద్ర, వివేక్ శానభాగ భాగస్వామ్యులయ్యారు. తమిళ, మళయాళ రచయిత జయమోహన్‌కు బుక్ బ్రహ్మ సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. 2 లక్షల రూపాయల నగదు అందచేశారు. చివరగా యక్షగానంతో బుక్ బ్రహ్మ ఉత్సవ్‌కు తెరదించారు.


స్టాల్స్ సందర్శనలో ఎడిటర్



జయమోహన్‌కు బుక్ బ్రహ్మ జీవనసాఫల్య పురస్కారం ప్రదానం

20 లక్షల రేషన్ కార్డులు రద్దు..!

- కొత్త నిబంధనలతో ఆందోళన

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొత్త నిబంధనలతో రేషన్ కార్డులు రద్దు అవుతాయన్న చర్చ జోరుగా సాగుతోంది. బీపీఎల్ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు.. రేషన్ మాత్రమే కాకుండా పలు ప్రభుత్వ పథకాలు వీటి ద్వారా పొందవచ్చు. వైద్యసదుపాయాలు, ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు, విద్య వంటి ఉచిత పథకాలు సులభంగా పొందడానికి రేషన్ కార్డులు ఉపయోగపడుతాయి. రాష్ట్ర జనాభాలో 80శాతం మంది బీపీఎల్ కార్డుదారులున్నారు. సుమారు 4కోట్లమందికంటే ఎక్కువ కుటుంబాలు బీపీఎల్ ప్రయోజనాలు పొందుతున్నారు. వీరంతా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్టు కాదు. అన్ని పథకాలు బీపీఎల్ కార్డుల రూపంలోనే అర్హతగా ఉండడంతో అసలుపైనే వేటు వేస్తే కొనరు పథకాలనుంచి ఉపశమనం పొందవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పలు నిబంధనలు కొత్తగా జారీ చేశారు. శాసనసభ సమావేశాల వేళలోనే అమలు చేయాలని భావించినా ప్రతిపక్షాల నుంచి పోరాటాలు సాగుతాయని వెనుకడుగు వేశారు. ఆరు నెలలుగా ఏ కుటుంబం రేషన్ పొందడం లేదో వారి కార్డును రద్దు కానున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 1.29 కోట్ల బీపీఎల్ కార్డులు ఉంటాయి. కొత్తగా రేషన్‌కార్డులకోసం 2.95 లక్షలమంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్తకార్డుల పరిశీలన సాగుతోంది. ఈలోగానే పాతకార్డులలో అర్హత లేనివాటిని తొలగించేందుకు కసరత్తు జరుగుతోంది. బీపీఎల్ కార్డు రద్దు అయితే కేవలం నిత్యావసరాలే కాదు గృహలక్ష్మితోపాటు పలు పథకాలకు దూరం కావాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలతో సుమారు 20లక్షల బీపీఎల్ కార్డులు రద్దు అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

విక్రమ్ సారాభాయ్ (జయంతి)



భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు ఆద్యుడైన విక్రమ్ సారాభాయ్ 1919 ఆగస్టు 12న గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జన్మించారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సర్ సీవీ రామన్ పర్యవేక్షణలో కాస్మిక్ కిరణాలపై పరిశోధనలు చేశారు. ఐఐటీ ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీని (పీఆర్ఎల్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) స్థాపించి ఎన్నో పరిశోధనలు చేశారు. భారత భవిష్యత్‌లో శాటిలైట్‌ల అవసరాలను గుర్తించి అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూకు వివరించి ఒప్పించారు. అణుశక్తి వ్యవస్థ పితా మహుడైన హోమీ బాబా పర్యవేక్షణలో ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ ఏర్పాటు చేసి పలు విజయాలు అందుకున్నారు. 1971 డిసెంబరు 30న కన్నుమూశారు. 1972లో మరణానంతరం 'పద్మవిభూషణ్' ప్రకటించారు.

హెలెనా బ్లావెట్‌స్కీ (జయంతి)



మేడ్ హెలెనా బ్లావెట్‌స్కీ 1831 ఆగస్టు 12న రష్యా దేశంలో జన్మించారు. థియోసాఫికల్ సొసైటీ (దివ్యజ్ఞాన సమాజం) సహసంస్థాపకులలో ఒకరు. రచయిత, ఆధ్యాత్మికత భావాలు కల్గిన ఆమె ఆసియా, యూరప్, అమెరికా ఖండాలతోపాటు ఇండియాలోనూ, టిబెట్‌లోనూ పర్యటించారు. ఆర్య సమాజ్‌కు అనుగుణంగా సొసైటీ పనిచేసేది. ఆమె మూడు పుస్తకాలను ప్రచురించారు. ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు కృషి చేశారు. 1891 మే 8న కన్నుమూశారు. ఆమె వర్ధంతిని వైట్ లోటస్ డేగా ఆచరిస్తారు.

సిద్దరామయ్య (పుట్టినరోజు)



కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న సిద్దరామయ్య 1948 ఆగస్టు 12న మైసూరు జిల్లాలో జన్మించారు. ప్రస్తుతం వరుణ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతకుముందు బాదామి నియోజకవర్గం ఎమ్మెల్యేగా కొనసాగారు. 2013-18ల మధ్య ఐదేళ్లపాటు పూర్తిస్థాయి పాలన అందించిన రెండో సీఎంగా గుర్తింపు పొందారు. చాముండేశ్వరి నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా కొనసాగారు. గతంలో జనతాదళ్, జేడీఎస్ పార్టీలలో కీలకంగా వ్యవహరించారు. అహింద పోరాట నేతగా ఎదిగారు.

సీతారాం ఏచూరి (పుట్టినరోజు)



సీతారాం ఏచూరి 1952 ఆగస్టు 12న మద్రాస్‌లో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) ప్రధాన కార్యదర్శి. సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు. విద్యార్థిగా స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ)లో కీలకంగా ఉండి అనంతరం సీపీఎంలో చేరారు. రాజకీయాల్లో కొనసాగుతూనే ప్రముఖ ఆంగ్ల దినపత్రిక హిందూస్తాన్ టైమ్స్‌లో కాలమ్స్ రాస్తుంటారు. రాజకీయ నాయకుడిగానే కాక ఆర్థికవేత్తగా, రచయితగా, కాలమిస్ట్‌గా గుర్తింపు పొందారు.

శాంతా ధనంజయన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత వన్నదిల్ పుదియవీత్తిల్ ధనంజయన్ భార్య శాంతా ధనంజయన్ 1943 ఆగస్టు 12న జన్మించారు. నృత్య దంపతులైన వీరు ధనంజయన్స్‌గా పేరొందారు. 2009లో 'పద్మభూషణ్' అందుకున్నారు. భరతనాట్యంపాటు కథాకళి, కర్ణాటక సంగీతంలోనూ రాణించారు. నృత్య చూడామణి, కళైమామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 1968లో చెన్నైలో భారత కళాంజలి ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసి ఎంతోమందికి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చారు.

పీట్ సంప్రాస్ (పుట్టినరోజు)



ప్రముఖ టెన్నిస్ క్రీడాకారులలో ఒకరైన పీట్ సంప్రాస్ 1971 ఆగస్టు 12న వాషింగ్టన్ డీసీలో జన్మించారు. టెన్నిస్ క్రీడలో ఉత్తమ క్రీడాకారుడిగా నిలిచారు. 7 వింబుల్డన్ పోటీల్లోను గెలిచారు. 14 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించారు. 1993 నుంచి 1998 వరకు వరుసగా ఆరేళ్లపాటు నెంబరు వన్ స్థానం కొనసాగారు. 7 వింబుల్డన్ టైటిల్స్, 2 ఆస్ట్రేలియన్ ఓపెన్స్, 5 యూఎస్ ఓపెన్‌టైటిల్స్ సాధించారు. స్పోర్ట్స్‌మ్యాన్ ఆఫ్ ది ఇయర్ తదితర అవార్డులు అందుకున్నారు. 1965 నుంచి 2005 వరకు 40 గొప్ప టెన్నిస్ క్రీడాకారులలో ఒకరిగా నిలిచారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

అనంతపురం టౌన్, ఆగస్టు 11: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలుగునాడు వైద్యఉద్యోగుల ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ వైద్య ఉద్యోగుల కుదింపు కోసం గత వైసీపీ ప్రభుత్వం జీవో 143, 32లను తీసుకొచ్చి తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. బదిలీలలోను ఇష్టారాజ్యంగా వ్యవహరించి మానసికక్షోభకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

నూతన కమిటీ ఎంపిక: తెలుగునాడు ఉద్యోగులు సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో సత్యసాయి, అనంత జిల్లాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతజిల్లా అధ్యక్షుడిగా దేవి మల్లికార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. శివప్రసాద్, జనరల్ సెక్రటరీగా పీఎల్ మురళీక్రిష్ణ, కోశాధికారిగా శివయ్యను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

మాణెక్ షా పరేడ్ మైదానంలో రిహార్సల్స్



మైదానంలో రిహార్సల్స్ ఇలా...

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు వేడుకలకు నగరం సిద్ధమవుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగే ప్రధాన ఘట్టం మాణెక్ షా పరేడ్ మైదానంలో జరగనుంది. ఇందుకోసం బీబీఎంపీ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని రిహార్సల్స్ నిర్వహించారు. పోలీసు కవాతు, బ్యాండ్ బృందాలు పాల్గొన్నాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని విధాలా కసరత్తు సాగిస్తున్నారు. ఇప్పటికే పరేడ్ మైదానం చుట్టూ ఆంక్షలకు సిద్ధం అవుతున్నారు. మరోవైపు విధానసౌధ వద్ద ఆదివారం పలువురు యువతులు జాతీయజెండాలతో సందడి చేశారు. కాగా నగరంలోని పలు పాఠశాలలు, కార్యాలయాలు, ఇతర ప్రాంతాల క్రీడా మైదానాల్లో సైతం రిహార్సల్స్ సాగుతున్నాయి.



విధానసౌధ వద్ద జాతీయ పతాకాలతో సందడి

హిందువులపై దాడి దుర్మార్గం

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి దుర్మార్గమని నినదించారు. హిందూ రాష్ట్ర జాగృతి ఆందోళన ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రీడంపార్కులో భారీ నిరసన జరిగింది. అక్రమ వలసదారులు, భవిష్యత్తులో భయోత్పాదకులని వారిని అరికట్టి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేరళ, కశ్మీర్, పశ్చిమబెంగాల్, అస్సోంలలో వారి ప్రభావం ఉందని ఇక కర్ణాటక దూరం లేదన్నారు. అక్రమంగా వలస వచ్చే వారిపట్ల కఠినంగా వ్యవహరించాల్సి ఉందని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ హిందువులారా ధైర్యంగా ఉండండి, మీకు అండగా మేం ఉన్నామని నినదించారు. సంపాదన, అధికార వ్యామోహం వీడి భరతమాతను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు.



ఫ్రీడం పార్కులో కార్యకర్తల నిరసన

రెండు వాహనాలు ఢీ... ఒకరి మృతి

● ముగ్గురుకి తీవ్ర గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం



మధుసూదన్ (ఫైల్)

చిలమత్తూరు, ఆగస్టు 11: ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీ కొనడంతో ఒకరు సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం వివరాలను వెల్లడించారు. కర్ణాటకకు చెందిన మధుసూదన్, శ్రీనివాసులు, గౌరీకృష్ణ హిందూపురం వైపు నుంచి ఇన్నోవాలో ఆదివారం ఉదయం బెంగళూరు వెళుతుండగా, హిందూపురానికి చెందిన షెక్షావలి తన జైలో వాహనంలో బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి హిందూపురం వస్తున్నాడు. 544-ఈ జాతీయ రహదారిలోని దేమకేతేపల్లి సమీపంలోకి రాగాను ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇన్నోవాలో ప్రయాణిస్తున్న కర్ణాటకకు చెందిన మధుసూధన్ (26) అక్కడికక్కడే మృతి చెందగా ఆ వాహనంలో ఉన్న మరో ఇద్దరు శ్రీనివాసులు, గౌరీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. మరో వాహనదారుడు షెక్షావలి వాహనంలోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు అతడికి బయటకు తీశారు. అతడి కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదంలో మృతి చెందిన మధుసూదన్ కోలార్ జిల్లాలోని శ్రీనివాసపురం జిల్లా హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.

నీరా కోసం వచ్చి.. తిరిగిరాని లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మధుసూదన్, గాయాలపాలైన శ్రీనివాసులు, గౌరీశంకర్ నీరా కోసం వచ్చి ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గురైన వా హనంలో నీరా లభించాయి. దీన్నిబట్టి చూస్తే హిందూపురం సమీపంలోని ఈత చెట్ల వనానికి వెళ్లి నీరా తీసుకువెళుతూ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది.

వేణుగోపాలనగర్‌కు బీఎంటీసీ బస్సు సేవలు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 11: నియోజకవర్గంలోని హుళిమావు సమీపానగల వేణుగోపాలనగర్‌కు బీఎంటీసీ బస్సు సేవలను మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. వేణుగోపాలనగర్ వాసుల వినతి మేరకు రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి సానుకూలంగా స్పందించారు. 369 నెంబరు సర్వీస్‌తో కేఆర్ మార్కెట్ నుంచి, మెజస్టిక్ నుంచి, శాంతినగర్ బస్టాండ్ నుంచి వేణుగోపాలనగర్‌కు బస్సు సేవలకు వీలు కల్పించారు. హుళిమావు స్థానిక కాంగ్రెస్ నాయకుడు మధు నేతృత్వంలో కార్యక్రమం సాగింది. మారుమూల గ్రామాలకు సైతం బీఎంటీసీ బస్సు సర్వీసులు అందేలా చొరవ చూపాలని అధికారులు భరోసా ఇచ్చారని సౌమ్యారెడ్డి తెలిపారు. శక్తి పథకం ద్వారా మహిళల ఉచిత ప్రయాణాలకు వీలైందని, ప్రత్యేకించి గ్రామస్థులకు, విద్యార్థులకు ఎంతో అనుకూలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఇది సాధ్యమైం దన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉమాపతిగౌడ, అరికెరె లోకేశ్ రెడ్డి, అభిషేక్ రెడ్డి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



బీఎంటీసీ బస్సు సేవలకు మాజీ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డి పచ్చజెండా

శిశువుల ఆరోగ్యరక్షణకు ప్రాధాన్యం



ఆసుపత్రి శాఖ ప్రారంభంలో ఎమ్మెల్యే బైరతి బసవరాజ్

మహదేవపుర, ఆగస్టు 11: నవజాత శిశువుల ఆరోగ్యరక్షణకు ఓవం ఆసుపత్రి ప్రాధాన్యత ఇస్తుందని కేఆర్‌పుర ఎమ్మెల్యే బైరతి బసవరాజ్ అభిప్రాయపడ్డారు. కేఆర్ పుర భట్రహళ్ళి జాతీయరహదారి పక్కన ఓవం ఆసుపత్రిశాఖను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాల వాసులకు అనుకూలం కానుందన్నారు. ఆసుపత్రి అధ్యక్షుడు డాక్టర్ ఆదర్శ సోమశేఖర్ మాట్లాడుతూ పేదలకు సైతం సామాన్యధరల్లో చికిత్సలు ఇక్కడ ఉంటాయన్నారు. గత ఐదేళ్లలో 15వేలమందికిపైగా చిన్నారులకు చికిత్సలు అందించామన్నారు. తక్కువ బరువు, ముందస్తుగా పుట్టినవారు, ఊపిరి సమస్యలు ఇతరత్రా ఇన్‌ఫెక్షన్‌ల చిన్నారులకు ఇక్కడ చికిత్సలు ఉన్నాయన్నారు. 2014లో బాణసవాడిలో నలుగురు వైద్యులతో ప్రారంభమైన ఆసుపత్రి ప్రస్తుతం బెంగళూరు వ్యాప్తంగా సేవలందిస్తోందన్నారు. తమ ఆసుపత్రి సాధనల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోపినాథ రెడ్డి, మెడికల్ డైరెక్టర్ వేణుగోపాల్, క్లినికల్ డైరెక్టర్ మురళి మోహన్, బీబీఎంపీ నామినేటెడ్ మాజీ సభ్యుడు ఆంటోణి స్వామి, మంజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాళికాంబ దేవి ఆలయ జీర్ణోద్ధరణ



అమ్మవారికి విశేష అలంకరణ

బంగారపేట, ఆగస్టు 11: తాలూకాలోని కామసముద్ర హోబళి కుందరసనహళ్ళి గ్రామంలో కాళికాంబదేవి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నూతన కళశ స్థాపన, అష్టబంధన, మహాకుంభాభిషేకం, హోమాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారు వనదుర్గి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వేకువజామున కాళికాంబదేవికి పంచామృతాభిషేకం, పుష్పార్చన జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా అన్నదానం నిర్వహించారు. అమ్మవారిని ఆరాధిస్తే ఆరోగ్యం, శక్తి, సమగ్ర విజయం సాధ్యమని భక్తుల విశ్వాసంగా ఉంది. ఆలయ అర్చకులు నారాయణప్ప నేతృత్వంలో కైంకర్యాలు సాగాయి. ఆలయ అభివృద్ధి సమితి అధ్యక్షుడు బీఈఎంఎల్ కేవీ కృష్ణప్ప, కార్యదర్శి టీకే కృష్ణప్ప, కేవీ వెంకటేశప్ప, గ్రామపంచాయతీ సభ్యుడు ఎంవీ సంతోష్, ఆర్‌కే శివకుమార్, అనంతకుమార్, కేసీ మునిరత్న, ఉపాధ్యాయుడు మునిస్వామి పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

బస్సు బోల్తా-పలువురికి గాయాలు

బాగేపల్లి, ఆగస్టు 11: బెంగళూరు - హైదరాబాద్ జాతీయ రహదారి 44పై చెందూరు క్రాస్ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టపర్తికి చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. ఆదివారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు జరిగిన ప్రమాదంలో 13మంది ప్రయాణికులు గాయపడగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. బెంగళూరు నుంచి పుట్టపర్తి వైపు వెళ్తున్న బస్సు గుడిబండ తాలూకా చెందూరు క్రాస్ వద్ద అదుపు తప్పి రోడ్డుపక్కన గుంతలోకి పడింది. క్షతగాత్రులను చిక్కబళ్ళాపుర జిల్లా ఆసుపత్రికి తరలించగా మిగిలిన వారిని బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గుడిబండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తమవంతు సహాయక చర్యలు అందించారు. మరింత సమాచారం అందాల్సి ఉంది.



గుంతలో పడిన బస్సు ఇదే...

గోళ్ల పంచాయతీకి జాతీయస్థాయి గుర్తింపు

● స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనాల్సిందిగా సర్పంచ్‌కు ఆహ్వానం

కళ్యాణదుర్గం, ఆగస్టు 11: మండలంలోని గోళ్ల గ్రామ పంచాయతీకి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. గ్రామ పంచాయతీని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపినందుకు ఎర్ర కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాల్సిందిగా సర్పంచ్ కవితకు పిలుపువచ్చింది. ఈ విషయాన్ని ఆదివారం ఎంపీడీఓలు సోలోమోన్, బాలాజీలు వెల్లడించారు. నిధుల కేటాయింపులో వైసీపీ ప్రభుత్వం విఫలమైనప్పటికీ సొంతనిధులు వెచ్చించి పంచాయతీని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నట్లు అధికారులు ప్రత్యేక నివేదికలు పంపారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాలు, డ్రైనేజీల పరిశుభ్రత, సురక్షిత నీటిని అందజేయడంతోపాటు అనేక సామాజిక కార్యకలాపాల్లో తన వంతు కృషి చేస్తూ గోళ్ల పంచాయతీని రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపింది. భర్త బొజ్జన్న సహకారంతో పంచాయతీ అభివృద్ధికి సాధ్యమైందని కవిత పేర్కొంది. గోళ్ల పంచాయతీకి రాష్ట్ర, జాతీయస్థాయిల్లో గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్, సవిత, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు.

ఆసుపత్రి ఎదుట ఆందోళన

వైద్యుల నిర్లక్ష్యంపై మృతుడి కుటుంబ సభ్యుల నిరసన





ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు, అరవింద్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, ఆగస్టు 11: తమ కుమారుడు అరవింద్ (24) వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని స్థానిక 60 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆదివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 29న కిడ్నీలో రాళ్లు ఉన్నాయని ఆసుపత్రిలో చేరాడన్నారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం వారం రోజులపాటు అడ్మిట్ చేసుకుని ట్రీట్‌మెంట్ ఇచ్చి ఈనెల 5న కర్నూలుకు వెళ్లాలని సూచించారని తెలిపారు. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుని అనంతరం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాడన్నారు. కిడ్నీ ఇన్‌ఫెక్షన్ అయి షుగర్ లెవెల్స్ పెరిగి మృతిచెందాడన్నారు. దాదాపు రూ. 6లక్షలు వైద్యం కోసం ఖర్చుచేయడం జరిగిందని వివరించారు. తమ కుమారుడు వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందాడని ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్, టూటౌన్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్, రూరల్ ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడారు. వైద్యులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

ఆంధ్ర సౌత్‌జోన్ జట్టుకు ఎంపిక



ధారామోహన్ | తేజస్విణి | మాన్విత | చక్రిక దండు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 11: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ బాలికల అండర్-15 క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. చక్రిక దండు, ధారామోహన్, మాన్విత, తేజస్విణి ఏసీఏ సౌత్‌జోన్ అండర్-15 బాలికల క్రికెట్ జట్టులో చోటు సాధించారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆగిన ఇన్‌ఫ్లో


బెళుగుప్ప, ఆగస్టు 11: రాగులపాడు పంప్‌హౌస్‌లో తలెత్తిన సాంకేతిక కారణాలతో రెండు మోటార్లు ఆఫ్ చేయడంతో జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం ఇన్‌ఫ్లో ఆగినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.263 టీఎంసీల నీరు నిల్వ వుందని సోమవారం నుంచి కృష్ణా జలాలను విడుదల చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 11: ఎస్కేయూలోని పలువిభాగాల్లో పాఠ్యాంశాలను బోధించేందుకు అకడమిక్ కన్సల్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాలమేరకు ప్రిన్సిపాల్ కృష్ణకుమారి నోటిఫికేషన్ జారీచేశారని ఆదివారం పీర్వో ప్రొఫెసర్ రామగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సైన్స్ విభాగంలో బయోకెమిస్ట్రీ, బోటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జియోగ్రఫీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, మ్యాథమెటిక్స్, మైక్రోబయోలజీ, ఫిజిక్స్, పాలిమర్ సైన్స్, సెరికల్చర్, జువాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్స్‌లో ఖాళీలు ఉన్నాయన్నారు. అదేవిధంగా ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్స్‌లో ఎకనామిక్స్, ఇంగ్లీష్, తెలుగు, కామర్స్, లైబ్రరీ సైన్స్, అడల్ట్ ఎడ్యుకేషన్, లా, రూరల్ డెవలప్‌మెంట్, సోషల్‌వర్క్, హిస్టరీ, ఎంబీఏ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పనిచేసేందుకు అకడమిక్ కన్సల్టెంట్స్ పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గంటల కొలమాన ప్రకారం జీతం ఉంటుందన్నారు. 13, 14తేదీల్లో ఆయా విభాగాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.

9 గంటలు విద్యుత్ ఇవ్వాలి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 11: పంటలు ఎండిపోతున్నాయని, 9 గంటలు ఇవ్వాలని ఆవులదట్ల రైతులు ఆందోళనకు దిగారు. పది రోజులుగా రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై రైతులు పెద్దసంఖ్యలో వచ్చి గంటపాటు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరమ్మతుల పేరుతో 9 గంటలు ఇవ్వాల్సిన విద్యుత్‌ను కేవలం రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. తమ సమస్యను తెలిపేందుకు విద్యుత్ అధికారులకు ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9 గంటల కరెంటును సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కృష్ణ, రామాంజినేయులు, సోమలింగ, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.60	1,628.68
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	36,739	13,234
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	54,960	10,701
సామర్థ్యం (టీఎంసీలు)	104.18	89.19

ఘనంగా అమరవీరుల దినోత్సవం



అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఏఐడీఎస్‌ఓ

బళ్లారి సిటీ, ఆగస్టు 11: స్వాతంత్ర్య సమరయోధుడు ఖుదీరామ్ బోస్ స్మారకంగా 116వ అమరవీరుల దినోత్సవాన్ని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సొంత లిందగన్న కాలనీ పార్కులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ జిల్లా అధ్యక్షులు కే.ఈరన్న ప్రసంగిస్తూ 19ఏళ్ల వయసులో బ్రిటీష్ పాశవిక ప్రభుత్వాన్ని అవహేళన చేసిన 19ఏళ్ల ఖుదీరామ్ బోస్ చిరునవ్వుతో ఉరివేసుకుని ఆదర్శప్రాయుడైనాడన్నారు. బెంగాలీ తల్లులు కూడా తమ ప్రియమైన పిల్లలు ఖుదీరామ్ లాగా మారాలనే ఆశతో ఇంట్లో పిల్లలకు అతని గురించిన పాటలే వినిపించేవారన్నారు. బ్రిటీష పాలనపై రాజీలేని పోరాటం చేయడం వల్లే ఖుదీరామ్ విద్యార్థుల మదిలో స్ఫూర్తిదాయకంగా నిలిచాడన్నారు. ఈసందర్భంగా ఏఐటీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి కంబాలి మంజునాథ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో అతి చిన్న వయసులోనే బ్రిటీష్ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడడానికి దేశంలోని పీడిత పేద ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమే కారణమన్నారు. ఆదివారం నాటికి ఖుదీరామ్ బోసును ఉరితీసి 116సంవత్సరాలు పూర్తయిందని, నేటికీ రైతులు, కార్మికులపై దోపిడీ ఆగలేదన్నారు. ఖుదీరామ్ పోరాట స్ఫూర్తిని మనలో పెంపొందించుకోవాలని, ఈదేశ విద్యార్థులు పేద ప్రజల దోపిడీని అంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే ఖుదీరామ్ బోస్‌కు నిజమైన గౌరవం ఇవ్వగలమన్నారు. ఈసందర్భంగా ఏఐడీఎస్‌ఓ ఉపాధ్యక్షురాలు శాంత, కార్యాలయ కార్యదర్శి నిహారిక, విద్యార్థులు, వందలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

యువ శక్తికి ప్రేరణ ఖుదీరాం బోస్



బోస్‌కు నివాళులర్పిస్తున్న చన్నబసవ

రాయచూరు, ఆగస్టు 11 : స్వాతంత్ర్య పోరాటంలో ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన ఖుదిరాం బోస్ ఆవేశం నేటి యువతకు స్ఫూర్తి దాయకమని ఏఐడీవైఓ జిల్లాధ్యక్షుడు చన్నబసవ జానేకల్ అన్నారు. ఖుదిరాం బోస్ 116 ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం నగరంలోని ఏఐడీవైఓ కార్యలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐడీవైఓ జిల్లా కార్యదర్శి వినోద్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మౌనేశ్, సందీప్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దంతచికిత్సలో లేజర్ ప్రాముఖ్యం



లేజర్ ప్రాముఖ్యతపై ప్రసంగిస్తున్న డా.మహంతేష్

బళ్లారి సిటీ, ఆగస్టు 11: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ డెంటల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో నిర్వహించారు. బెంగళూరులోని ఆక్స్‌ఫర్డ్ డెంటల్ కాలేజీకి చెందిన డాక్టర్ మహంతేష్ దంతచికిత్సలో లేజర్ ప్రాముఖ్యత అనే అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ శేష గిరిరావు, డాక్టర్ దివాకర్, డాక్టర్ ఉమాశంకర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.మధు సూదన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ మంజునాథ్ ఆర్కే, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



తెగిన క్రస్ట్ గేట్‌ను పరిశీలిస్తున్న అధికారులు





ఆశలన్నీ అడియాసలేనా!

- ఆయకట్టు రైతుల్లో నిరాశ
- 65 టీఎంసీల నీరు నదికి మళ్లింపు
- 19వ క్రస్ట్‌గేటు నదిలో కొట్టుకుపోయిందా.. లేక అక్కడే జలాశయంలో ఉందా..?
- క్రస్ట్ గేటు తయారీ విజయనగరలో ప్రముఖ కంపెనీలకు అప్పగింత
- డ్యాంను పరిశీలించిన కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బళ్లారి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): టీబీడ్యాంకు అమర్చిన 19వ క్రస్ట్ గేటు చైన్ లింక్ శనివారం రాత్రి తెగిపోవడంతో నీరంతా నదిలోకి వెళ్లిపోతోంది. ఈ సంవత్సరం డ్యాంలో 105 టీఎంసీల నీరు చేరడంతో రైతులందరూ ఎంతో ఆనందించారు. తమకు రెండు మూడేండ్ల వరకు సాగు, తాగునీటికి కొదవఉండదని భావించారు. కాని వారి ఆశలను అడియాసలు చేస్తూ గేట్ కూలిపోయింది. సుమారు 65 టీఎంసీల నీటిని నదికి మళ్లించారు. ఈ నీటితో సుమారు ఆరు లక్షల ఎకరాల్లో పంటలు పండించవచ్చు. చేతి దగ్గరకు వచ్చింది నోటి దగ్గరకు రాలేదని రైతులంతా ఉస్సూరుమంటున్నారు.

డ్యాంలో 40 లేదా 45 టీఎంసీల నీటి నిల్వ ఉంటేనే క్రస్ట్ గేటు అమర్చేందుకు వీలు అవుతుందని అధికారులు అంటున్నారు. ఇన్‌ఫ్లోతోపాటు డ్యాంలో ఉండే నీరు అంతా నదికి వదులుతున్నారు. 65 టీఎంసీల నీరు కిందకు వెళ్లడానికి కనీసం మూడు రోజుల వ్యవధి పడుతుందని బోర్డు వర్గాలు తెలిపాయి. నది తీరంలో ఉండే గ్రామాలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి, ఇతరఎమ్మెల్యేలు, ఆంధ్ర నుండి రాయదుర్గం ఎమ్మెల్యే కాలువశ్రీనివాసులు డ్యామ్‌ను పరిశీలించారు. వారికి రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కూలినగేటు నదిలో ఉందా, లేక కొట్టుకుపోయిందా అనేవిషయంపై స్పష్టత రాలేదు. కొత్తగేటు తయారీని ప్రముఖకంపెనీకి అప్పగించినట్టు చెబుతున్నారు. వాస్తవానికి ఇంత పెద్ద ప్రమాదంలో అధికారుల నిర్లక్ష్యం ఉందని రైతులు మండిపడుతున్నారు. వర్షాకాలానికి ముందే క్రస్ట్‌గేట్లను అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ఒకటికి రెండు సార్లు పరిశీలించి ఫిట్‌గాఉందని నిర్ధారించుకున్నాక పైఅధికారులకు రిపోర్టు చేస్తారు. కానీ డ్యామ్ అధికారులు ఎందుకు ప్రమాదాన్ని పసిగట్టలేక పోయారోననే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఇంజనీర్ల నిర్లక్ష్యంతోనే టీబీ డ్యాం గేట్ ప్రమాదం

బళ్లారిరూరల్, ఆగస్టు 11: విజయనగర జిల్లా హోస్పేట టీబీ డ్యామ్ 19వ గేటు స్పెక్టర్ ఎక్స్‌వేటర్ చైన్ తెగిపోవడంతో టీబీ బోర్డు అధికారులు ఇంజనీర్ నిర్లక్ష్యమని ప్రొఫెసర్ నంజుండగౌడ స్థాపిత హసురుసేన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిందిగేరి గోవిందప్ప మండిపడ్డారు. సింధిగేరి గోవిందప్ప మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ కర్ణాటక మూడు రాష్ట్రాలకు తుంగభద్రా నది జీవనదని గత సంవత్సరం వర్షాలు లేక రైతులు ఇబ్బందులకు గురై లక్షలాది హెక్టార్లలో వరి పంట చేసుకునేందుకు ఇబ్బందుల్లోపడ్డారని ఈ సంవత్సరం భద్రావతి తదితర ప్రాంతాల్లో ఎడతెరపి లేకుండా వర్షాలు రావడంతో రైతులు ఉత్సాహంతో ముందస్తుగా వరినాట్లు వేసుకొని నార్లు పోసుకుని నాట్లేసే సమయంలో టీబీ డ్యామ్ బోర్డు అధికారులు ఇంజనీర్ల నిర్లక్ష్యంతో 19వ గేట్ ప్రాబ్లమ్ కావడంతో ఇది ఇంజనీర్ నిర్లక్ష్యమేనని మీడియాకు తెలిపారు. గేట్లను మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంజనీర్లు ఖచ్చితంగా పరిశీలించాలని, కాని అలా జరగలేదని, కనుక ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. టీబీ డ్యామ్‌ని నమ్ముకుని లక్షల హెక్టార్లలో వరి, మిరప పంటలను ముందస్తుగా వేసుకున్నారని 19వ గేట్‌కు వీలైనంత త్వరలో మరమ్మత్తులు చేయాలని కోరారు.



తెగిపోయిన 19వ క్రస్ట్ గేట్ చైన్ లాక్ ఇదే

వివాహ వేడుకల్లో కేపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



వివాహ వేడుకల్లో పాల్గొన్న నారా సూర్యనారాయణ రెడ్డి, ఇతర రైతు సంఘం నాయకులు

బళ్లారిరూరల్, ఆగస్టు 11: తాలుకాలోని దమ్మూరు వెంకప్పతాత దేవస్థానం ఆవరణలో నిర్వహించిన కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం రాజ్యాధ్యక్షుడు మాధవరెడ్డి కుమారుడు అశోక్‌రెడ్డి, కీర్తన వివాహానికి కేపీసీసీ రాజ్య ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం నాయకులు, రాజకీయ నాయకులు, గ్రామాల రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

తుంగభద్ర తీర గ్రామాలు అప్రమత్తం

రాయచూరు, ఆగస్టు 11 : తుంగభద్ర డ్యాం 19వ క్రస్ట్ గేట్ చైన్ లాక్ తెగిపోవడంతో ఒక్కసారిగా నదికి వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం రాయచూరు జిల్లా సరిహద్దులో ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో 2 లక్షల క్యూసెక్కులకు పైగా ప్రవాహం ఉండడంతో జిల్లా యంత్రాంగం తీర గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండమని హెచ్చరికలు జారీ చేసింది. కాగా సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉన్న తుంగభద్ర డ్యాం నిర్మాణం జరిగిన అనంతరం తొలి సారి ఇలాంటి ప్రమాదం ఎదురు కావడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. డ్యాం తెగిపోయిన గేట్‌చైన్‌ను మరమ్మతు చేసేందుకు ఇప్పటికే చైన్నై, హైదరాబాద్‌ల నుంచి నిపుణులను రప్పించగా వారు ఆదివారం సాయంత్రానికి ఇక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. కాగా గేట్‌ను మరమ్మత్తు చేసేందుకు దాదాపు వారం రోజులకు పైగా సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో తెగిపోయిన గేట్ చైన్‌ను మరమ్మతు చేయాలంటే జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటిమట్టాన్ని మరో 50 అడుగులకు తగ్గించాల్సి ఉంటుందని దీంతో 40 టీఎంసీలకుపైగా నీరు దిగువకు విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.. ఈ క్రమంలో దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాల్సిందిగా రాష్ట్ర అధికారులు జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.



తెగిపోయిన తుంగభద్ర డ్యాం గేట్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

19వ గేటు ప్రమాదానికి కారణం ప్రభుత్వమే

- ఆందోళన వ్యక్తంచేసిన ఏఐకేకేఎంఎస్

బళ్లారి సిటీ, ఆగస్టు 11: విజయనగరం జిల్లా తుంగభద్ర డ్యాం 19వ గేటు గొలుసు తెగిపోవడంపై ఏఐకేఎంఎస్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇందుకుకారణమైన అధికారుల నిర్లక్ష్యాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.ఎం.శశిధర్, రాష్ట్ర కార్యదర్శులు బి.భగవాన్‌లు తీవ్రంగా ఖండించారు.

ప్రతి సంవత్సరం రిజర్వాయర్‌కు నీరు రాకముందే నీటి పరిస్థితిని పరిశీలించి, ప్రతి యూనిట్‌ను జాగ్రత్తగా పరిశీలించి, ఏదైనా సమస్య కనిపిస్తే పరిష్కరించేందుకు తీవ్రంగా కృషిచేస్తే ఇలాంటి దుర్ఘటనలు జరిగేవి కావన్నారు. అయితే దీనికి పరీక్షలు చేశారా? లేదా? అనేది ఇప్పుడు అనుమానంగా మారిందన్నారు. ఈ ప్రమాదంలో జరిగిన ప్రాణనష్టం, పంట నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించి మొత్తం నష్టాన్ని భరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలన్నారు. దీంతో పాటు రిజర్వాయర్‌లోని నీరంతా నదికి వెళ్లకుండా డ్యామ్‌కు త్వరగా మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నదులు ఫుల్.. కాలువలకు నీరు నిల్..



నీరులేక వట్టిపోయిన బాగేవాడి కాలువ

బళ్లారి సిటీ, ఆగస్టు 11: బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా బాగేవాడి కాలువ చివరి భాగానికి నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ కాలువద్వారా సిరుగుప్ప తాలూకా షానవాస్పూర్ గ్రామం నుంచి టెక్కలకోట, సిరుగుప్ప, బాగేవాడి ప్రాంతాలలోని 10వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రతి సంవత్సరం ఈకాలువ కింద వరి, పత్తి, మిరప వంటి ముఖ్యమైన వాణిజ్య పంటలను పండిస్తారు. కాలువకు మరమ్మతులు చేయని కారణంగా బలకుంది, ఉప్పరహోసల్లి, పొప్పనహాల్, అరళిగనూరు, హాశేకోట,సిరుగుప్ప, బాగేవాడి ప్రాంతాలకు నీరు సక్రమంగా రావడం లేదు. దీంతో కాలువ చివరి ప్రాంత రైతులు నీరులేక పంటలు పండక నానా అవస్థలు పడుతున్నారు.

నీటి అక్రమవినియోగదారుల సంఖ్య పెరుగుతుండడంతో కాలువ నిర్వహణలేక, చివరి వరకు నీరు రావడం లేదు. నీటి నిర్వహణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా సక్రమంగా నీరు అందించకపోతే కాలువ ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేసినా కాల్వకు రావడంలేదని చెబుతున్నారు. ఈ సమస్యపై ఉప్పరహోసల్లి రైతులు పలుమార్లు రోడ్డుపై బైఠాయించి అధికారులకు వినతిపత్రాలు అందించారు.

వ్యవసాయంపై విద్యార్థులకు శిక్షణ

కంప్లి, ఆగస్టు 11 : విద్యార్థులకు చదువుతో పాటు వ్యవసాయ రంగంపై కూడా ఆసక్తి వుండేలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠశాల పరిధిలోని పొలాల్లోకి విద్యార్థులను తీసుకెళ్లి నాట్లు వేయడం నేర్పిస్తున్నారు. కంప్లి తాలుకాలోని మెట్రి గ్రామంలోని హైస్కూలు విద్యార్థులకు పొలాలకు తీసుకెళ్లి వ్యవసాయ రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే కూడ్లిగి వద్ద కూడా ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పించేందుకు నాట్లు వేసే విధానంపై అవగాహన కల్పించారు. రాబోయే కాలంలో వ్యవసాయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చదువుతో పాటు ఈ రంగంపై ముందడుగు వేసేందుకే తాము అవగాహన పెంచుతున్నామని ఉపాధ్యాయులు తెలిపారు.



కూడ్లిగి వద్ద నాట్లు వేస్తున్న విద్యార్థులు



మెట్రి వద్ద నాట్లు వేయడంలో ఉపాధ్యాయుల శిక్షణ

హోసూరు జోన్

లోకకల్యాణార్థం.. చండీయాగం



చండీ యాగం చేస్తున్న దృశ్యం

హోసూరు ఆగస్టు 11: హోసూరులోని ప్రసిద్ధి చెందిన మరకతాంబ చంద్రచూడేశ్వర ఆలయంలో లోకకల్యాణార్థం శుక్రవారం నుంచి ఆదివారం వరకు మహా నవచండి యాగం జరిగింది. ఈ మహా నవ చండీ యాగం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు గణపతి హోమంతో ప్రారంభమై సాయంత్రం 7 గంటలకు కళశపూజ, మహా దీపారాధనతో ముగిసింది. అలాగే ఆదివారం ఉదయం 7 గంటలకు కళశపూజ, లక్ష్మీహోమం, దుర్గాయాగం, కన్యాపూజ, సువాసిని పూజ, మహాపూర్ణాహుతి, గణపతి , శ్రీ చక్రకలశాభిషేకం నిర్వహించారు. ఈ మూడు రోజులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఎక్కువ సంఖ్యల్లో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

హోసూరు ఆగస్టు 11: బాగలూరులో న్యూ డెమొక్రటిక్ లేబర్ ఫ్రంట్ రివల్యూషనరీ పీపుల్స్ అథారిటీ తరపున ఆదివారం విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ప్రదర్శన జరిగింది. ఇందులో పేదలకు కరెంటు బిల్లులు పెంపును రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బిల్లుల చట్టం 2022ను అంగీకరించరాదని డిమాండ్ చేశారు. అన్ని రకాల విద్యుత్ ఉత్పత్తిని ప్రభుత్వ అంగీకరించి అమలు చేయాలని, ప్రైవేటీకరణ విధానాన్ని విడనాడాలని నిరసన తెలిపారు. ప్రదర్శనకు జిల్లా అధ్యక్షుడు రవిచంద్రన్ అధ్యక్షత వహించారు. లిబరేషన్ టైగర్స్ పార్టీ జిల్లా కార్యదర్శి రామచంద్రన్, సోషల్ సైన్స్ ల్యాబ్ ప్రసాద్, రివల్యూషనరీ పీపుల్స్ అథారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాగలూరు జయరామన్, ఎఫ్ఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోసూరు సందురం, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నస్వామి ప్రసంగించారు. జిల్లా కార్యదర్శి శంకర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రదర్శనల్లో రైతులు, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన తెలుపుతున్న న్యూడెమొక్రటిక్ లేబర్ ఫ్రంట్

ముత్తు మారియమ్మ ఆలయంలో అన్నదానం



అన్నదానంలో ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

హోసూరు ఆగస్టు 11 : బెంగళూరు జాతీయ రహదారిపై హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముత్తుమారియమ్మ ఆలయ 33వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. గత 10 రోజులుగా అమ్మవారికి ప్రత్యేక అలంకార అభిషేక పూజలు నిర్వహించారు. ఆదివారం చివరి రోజు కావడంతో హోసూరు ఎమ్మెల్యే వైప్రకాశ్, హోసూరు మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటేశ్, బాబు, రాజు, రామనాథన్, సెల్వం, వేలు ఆలయ కమిటీ నిర్వాహకులు, మణి, కుమార్, రామమూర్తి, కార్తీక్, మురుగన్, సుందరమూర్తి, సామాజిక కార్యకర్తలు చెన్నప్పన్, దురైస్వామి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థలో మార్పులపై చర్చించాలి



మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి లక్ష్మీనారాయణ

- సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, ఆగస్టు 11: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో మార్పులపై ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం సమావేశాన్ని నిర్వహించి చర్చించిన తర్వాత తగు నిర్ణయం తీసుకోవాలని సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం నాయకులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల రూపకల్పన చేసినప్పటికీ ఉద్యోగుల విధివిధానాలు, జాబ్ చార్ట్, ఉద్యోగోన్నతి, తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. సచివాలయ ఉద్యోగులపై కొందరు అధికారులు వివక్ష చూపుతూ సంబంధంలేని పనులు చేయిస్తున్నారన్నారు. పలు రకాల వింత నిబంధనలు విధించి షోకాజ్‌లు, మెమోల పేరుతో ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రామ సచివాలయాల రేషనలైజేషన్, క్లస్టర్ విధానం అమలు, ఉద్యోగుల రేషనలైజేషన్ తదితర ప్రతిపాదనలు కూటమి ప్రభుత్వం తెరపైకి తేవడంతో ఏం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారన్నారు. ఏ ఉద్యోగులను ఎక్కడ సర్దుబాటు చేస్తారో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘాల నాయకులతో ప్రభుత్వ పెద్దలు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, కొత్త నిర్ణయాలపై సమాలోచనలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించడంతోపాటు మాతృశాఖలకు అనుసంధానం చేయాలన్నారు. రెండు సంవత్సరాల ప్రొబేషన్ కాలాన్ని పరిగణలోకి తీసుకొని ఇంక్రిమెంట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెరుగైన భవిష్యత్, హక్కుల సాధన కోసం పోరాడేందుకు సచివాలయ ఉద్యోగులు అందరూ ఏకమై కలిసి రావాల్సిన అవసరం ఉందన్నారు. శివశంకర్, హనుమంతు, నరసింహ, మహేష్, రామాంజనేయులు, హనుమంతరెడ్డి, భగీరథరెడ్డి, ఈశ్వర్, ముత్యాలు, మణిదీప్, ధనుంజయ పాల్గొన్నారు.